సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



వరద జోరు
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులకు మళ్లీ వరద ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



చీటీల పేరుతో మోసం
చీటీల పేరుతో మోసానికి పాల్పడిన సంఘటన కొత్తకోటలో చోటుచేసుకుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
23.4 /32.6

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా రాములోరి కల్యాణం



ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో గురువారం సీతా రాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాములను అందంగా ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ కనులపండువగా కల్యాణాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి.. కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు.

వాహనాల వేలం వాయిదా

అలంపూర్: పలు దాడుల్లో జప్తు చేయబడిన వాహనాల వేలం వాయిదా పడినట్లు ఎక్సైజ్ సీఐ హనుమానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయ ఆవరణలో గురువారం వాహనాల వేలం పాట నిర్వహించగా.. మెహకల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన విలువ మేరకు వేలం పాట పాడేందుకు ఎవరు ముందుకు రాలేదని తెలిపారు. దీంతో వేలం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో త్వరలో తేదీని నిర్వహించి వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

గద్వాల క్రైం: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదిన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంట కవిత దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, ఎక్సైజ్ తదితర కాంపౌండబుల్ కేసులను ఇరు వర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



జోగుళాంబ శక్తిపీఠం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాష, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కు జోగుళాంబ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ ఈఓ పురేందర్ అందజేశారు. గురువారం ఈఓ వారిని కలిసి ప్రతీ ఏటా దేవి శరన్నవరాత్రి బ్రహోత్సవాలలో ఏపీ ప్రభుత్వం నుంచి అమ్మవారికి కర్నూలు కలెక్టర్ పట్టువస్త్రాలు తీసుకురావడం ఆనవాయితీగా వస్తుందని అదే సాంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించాలని కోరారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతోపాటు పలు విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, ఇన్‌చార్జ్ సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య ఆచారి పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5,756

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు గురువారం 298 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 5756, కనిష్టం రూ. 2009, సరాసరి రూ. 4132 ధరలు పలికాయి.

ఆరోగ్య బీమా.. వృద్ధులకు ధీమా



కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం
- ఆదాయంతో సంబంధం లేకుండా వర్తింపు
- త్వరలో అందనున్న హెల్త్‌కార్డులు
- జిల్లా వ్యాప్తంగా 64,168 మందికి ప్రయోజనం

గద్వాల క్రైం: వృద్ధుల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆదాయంతో సంబంధం లేకుండా ఆరోగ్య బీమా కల్పించేందుకు అడుగులు వేసింది. దేశ ప్రజల సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి - జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం -జేఏవై)ను 2018 నుంచి అమలు చేస్తోంది. తాజాగా ఈ పథకాన్ని 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు విస్తరించింది. ఆదాయంతో సంబంధం లేకుండా వృద్ధులందరూ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా పొందవచ్చు. గత పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం గద్వాల- అలంపూర్ సెగ్మెంట్‌లలో 70 ఏళ్లు పైబడిన 64,168 మంది వృద్ధులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. ఇందులో 70 నుంచి 79 ఏళ్లు పైబడిన వారు 56,864 ఉండగా 80 ఏళ్లు పైబడిన వారు 7,304 మంది ఉన్నారు.

ఆదాయంతో సంబంధం లేకుండా..

కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఆయుష్మాన్ భారత్ పేరుతో ఉద్యోగులకు సైతం హెల్త్ స్కీం అమలు చేస్తుంది. అయితే తెల్లరేషన్ కార్డులు ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఏ ఆసుపత్రిలో అయినా వైద్య సేవలు పొందవచ్చు. ఇదిలాఉండగా, ఈ పథకంపై ప్రభుత్వం అవగాహన కల్పించకపోవడం, రేషన్ కార్డు లింకు పెట్టడంతో జనం పెద్దగా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే ప్రజలు ఎక్కువగా వైద్యం చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఆదాయంతోపాటు రేషన్, ఆధార్ కార్డులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఏడాదికి రూ. 5లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలని నిర్ణయించింది. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వారందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు.

వృద్ధులకు ఎంతో మేలు



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన **కొత్త బీమా** పథకం**తో వృద్ధులకు** ఎంతో **మేలు** జరగనుంది. **షుగర్, బీపీ, ఇతర** దీర్ఘకాలిక **వ్యాధులతో** చాలా **మంది బాధపడు**తున్నారు. అలాంటి వారికి **వైద్యం చేయించాల**ంటే చాలా ఖర్చుతో కూడిన పని. ఈ పథకం అమలైతే వృద్ధుల కుటుంబ సభ్యులకు వైద్యసేవల విషయంలో ఆర్థికంగా ఇబ్బందులు తప్పుతాయి.

– కర్రెయ్య, కేటీదొడ్డి

అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందించాలి



ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రతి ప్రైవేటు ఆసుపత్రిలో ఖచ్చితంగా వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే పథకం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలి.

– విజయ్‌కుమార్, గద్వాల

త్వరలో హెల్త్‌కార్డులు జారీ



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ బీమా పథకాన్ని జిల్లా ప్రజలందరికి తెలియజేస్తాం. బీమా పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్య సేవలు అందనున్నాయి. ఆదాయంతో సంబంధం లేకుండా ఈ పథకం వర్తిస్తుంది. త్వరలోనే అర్హులైన వృద్ధులకు హెల్త్ కార్డులు జారీ చేస్తాం. వృద్ధుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– సిద్దప్ప, జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి

మహిళాశక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: తెలంగాణ సాయుధపోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర విశేషమైనదని మహిళా చైతన్యం, శక్తికి ప్రతీక అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల హక్కుల కోసం భూస్వాముల అక్రమార్కులకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారిమణి ఐలమ్మ అన్నారు. నేటితరానికి ఆమె చూపిన మార్గం ఆదర్శనీయమని అందరూ కూడా ఆమె బాటలో ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ, ఏవో భద్రప్ప, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

మహిళాశక్తి పథకం లక్ష్య సాధనకు ప్రణాళికలు వేగవంతం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల్లో యూనిట్లు, ప్రయోజనకరంగా నూతన ఆలోచనలతో దీర్ఘకాలం ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా మైక్రో ఎంటర్‌ప్రైజేస్, స్కూల్ యూనిఫాం స్టిచింగ్, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మదర్‌యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మిల్క్‌పార్లర్లు వంటి విభాగాల్లో నెలవారీగా యూనిట్లు గుర్తింపు, స్థాపన, లక్ష్యాలను సాధించేందుకు మండలాల వారీగా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రౌండింగ్ కాకుండా పెండింగ్‌లో ఉన్న యూనిట్లు వెంటనే గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ అధికారి షకీలాభాను, ఇంచార్జీ డీపీఎం సక్రియానాయక్, ఏపీఎంలు, డీపీఎంలు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

ఎర్రవల్లి: తెలంగాణ భూపోరాటానికి నాంది పలికిన వీర వనిత చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పదో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిరంకుశ రజాకార్లకు వ్యతిరేకంగా ఐలమ్మ ఎదురించిన తీరు అందరికీ ఆదర్శమన్నారు. ఆమె చేసిన పోరాట ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి అని, మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. మహిళలందరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు



రాజోళి కేజీబీవీ వద్ద నీటి ట్యాంకు, పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

రాజోళి: విద్యార్థులకు మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించవద్దని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అన్నారు. గురువారం రాజోళిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను, పరిసరాలను ఆమె పరిశీలించారు. కిచెన్ షెడ్ అసంపూర్తిగా ఉందని, వీలైనంత త్వరగా దాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించడంతోపాటు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని ఆరా తీశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని, సదుపాయాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, ఆసుపత్రి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

మానవపాడు: మిత్ర ఆరోగ్య క్యాంపులో భాగంగా ఆయా గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు, వీటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీసీఈఓ కాంతమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను, పీహెచ్‌సీలో మెడికల్ క్యాంపును ఆమె పరిశీలించారు. పాఠశాల పైకప్పు పెచ్చులూడగా త్వరలో మరమ్మతులు చేయిస్తామన్నారు. ఇక పారిశుద్ధ్య కార్మికులు మెడికల్ క్యాంపులో పరీక్షలు చేయించుకోగా.. ఎంతమందికి బీపీ, షుగర్ ఉందని, మందులు విధిగా వాడి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ శివప్రసాదు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుకు వయసు అడ్డంకి కాదు..

గద్వాల న్యూటౌన్: చదువుకు వయస్సుతో నిమిత్తం లేదని, చదువు రాని వారు ఏ వయస్సులో ఉన్నా చదువు నేర్చుకోవచ్చునని ఎన్ఐఎల్‌పీ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ అనిత అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు 'న్యూ ఇండియా లిటరసీ' కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మట్లాడారు. 15 ఏళ్లు పైబడి నిరక్షరాస్యులుగా ఉన్న ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా మార్చాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క అక్షరాస్యులు 'ఈచ్ ఒన్ టీచ్ టు' గా చదువు చెప్పి అక్షరాస్యత శాతాన్ని పెంచేలా బాధ్యతను తీసుకోవాలని కోరారు. మెప్మా రీసోర్స్ పర్సన్‌లు, చదువుకున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు వలంటీర్లుగా మారి వారి పరిధుల్లోని నిరక్షరాస్యులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు చదువు చెప్పి అక్షరాస్యులుగా మార్చాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్ మాట్లాడుతూ న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో అక్షరాస్యులు అందరూ భాగస్వాములై జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం కార్యక్రమంలో బాగంగా రూపొందించిన మ్యాచింగ్–బ్యాచింగ్ ప్రొఫార్మా కాపీలను కమీషనర్, పీఓలు అందజేశారు. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ వెంకటేశ్వర్లు, టీఎంసీ శ్రీకర్, సీఓలు నిజాముద్దీన్, మహలక్ష్మీ, తిమ్మన్న, ఆర్‌పీలు పాల్గొన్నారు.



ప్రొఫార్మా కాపీలను అందజేస్తున్న కమిషనర్, పీడీ


పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: కేసుల చేదనలో కింది స్థాయి సిబ్బంది కృషి ఎంతో కీలకంగా ఉంటుందని, పెండింగ్ వాటి విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెండింగ్ కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని, బాధితులతో సమన్వయం, నిస్పక్షపాతంగా మాట్లాడి వీలైనంత త్వరగా న్యాయం అందేలా చూడాలన్నారు. మత్తు కలిగించే పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎక్కడిక్కడ వాటిని నిలువరించాలని, నిషేధిత కల్లు, మద్యం, గంజాయి, కొకైన్, తదితర పదార్థాల సరాఫరా వంటి అంశాలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాల కేసుల్లో ప్రత్యేకంగా దృష్టి సారించి నేరస్తులను నిలువారించాలని, ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన గస్తీ నిర్వహించాలలని ఆదేశించారు. అనంతరం దొంగతనాల కేసుల పురోగతి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు, బ్లూకోర్టు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు రవిబాబు, టాటబాబు, నాగేశ్వరెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంతో ప్రజలకు ఇబ్బందులు



కాలనీల్లో మురుగునీటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారని, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టకుంటే పాలకులను, అధికారులను నిలదీసే కార్యక్రమాలు చేపడుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీలోని ఆటోనగర్ కాలనీలో బీజేపీ నాయకులు పర్యటించి, పలు సమస్యలను గుర్తించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీలోని అనేక కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో కాలనీలు మురికి కూపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా.. ప్రజల నుంచి అధికారులు పన్నులు వసూలు చేస్తున్నా.. పాలకులు, అధికారులు మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించడం లేదని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ కాలనీలు చెరువులను తలపిస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేన రావు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో తగ్గిన నీటి నిల్వ



శ్రీశైలం జలాశయం

- 12 రోజుల్లో జలాశయంలోని 40 టీఎంసీలు ఖాళీ
- 215 టీఎంసీలకు గానూ ప్రస్తుత నీటి నిల్వ 170 టీఎంసీలకు పరిమితం
- కల్వకుర్తి ఎత్తిపోతల కింద వాడుకున్నది కేవలం 3 టీఎంసీలే
- మళ్లీ వరద నీటిపైనే ఆశలు

సాక్షి, నాగర్‌కర్నూల్: శ్రీశైలం జలాశయంలోని నీటినిల్వలు శరవేగంగా ఖాళీ అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటి వినియోగంతో 12 రోజుల్లోనే ప్రాజెక్టులోని 40 టీఎంసీల నీరు ఖాళీ అయింది. ఇరురాష్ట్రాల జలవిద్యుదుత్పత్తితో పాటు సాగునీటి ప్రాజెక్టులకు భారీస్థాయిలో ప్రాజెక్ట్ నుంచి నీటిని వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 885 అడుగులకు ప్రస్తుతం 876.10 అడుగులకు తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్ట్ మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 170.6640 టీఎంసీల నీటి నిల్వకు పరిమితమైంది. గురువారం రాత్రి 7 గంటల సమయంలో జలాశయానికి జూరాల స్పిల్ వే ద్వారా 70,420 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 34,360, సుంకేసుల నుంచి 6,710 మొత్తం 1,11,470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఎడమ గట్టు భూగర్భకేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ జలవిద్యుత్ 36,904 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 9,811 మొత్తం 46,715 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోని నీటిని మొదటగా తాగునీటికి, తర్వాత సాగునీరు, అనంతరం విద్యుదుత్పత్తి కోసం ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా ఇరు రాష్ట్రాలు పోటాపోటీగా విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం ఇస్తుండటంతో ప్రాజెక్టులో నీరు వేగంగా తగ్గిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే జలాశయం పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి కన్పిస్తోంది. కాగా.. మూడు రోజులుగా వరద పెరుగుతుండడంతో దీనిపైనే ఆశలు నెలకొన్నాయి.

కల్వకుర్తి ఎత్తిపోతలకు 3 టీఎంసీలలోపే..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కేవలం వారం రోజుల పాటు మాత్రమే అధికారులు నీటి ఎత్తిపోతలను చేపట్టారు. ఆ సమయంలో రోజుకు సుమారు 1,500 క్యూసెక్కుల నీటిని కేఎల్ఐ కింద విడుదల చేశారు. కేఎల్ఐ ద్వారా ఒక మోటారును నడిపి ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి రిజర్వాయర్లను నింపి ఆ తర్వాత ఎత్తిపోతలను నిలిపివేశారు. ఈ పథకం కింద ఇప్పటివరకు కేవలం మూడు టీఎంసీలలోపే నీటిని వినియోగించారు. వారం రోజులుగా కేఎల్ఐ కింద నీటి విడుదల సాగడం లేదు. ఇటీవల భారీ వర్షాలకు కేఎల్ఐ కాల్వలు పలు చోట్ల తెగడం, గండి పడటంతో ఆయకట్టుకు నీటి విడుదల నిలిచిపోయింది. తెగిన కాల్వలకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు సైతం ప్రారంభించకపోవడంతో సమీప భవిష్యత్‌లోనూ ఆయా చోట్ల రైతులకు సాగునీరు అందించే పరిస్థితి కన్పించడం లేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ఎత్తిపోతలు ప్రారంభం కాకపోగా, ఇప్పటికే అందుబాటులో ఉన్న కేఎల్ఐ ద్వారా సైతం పూర్తి స్థాయిలో ఎత్తిపోతలకు నోచుకోవడం లేదు. కేఎల్ఐ కాల్వల నిర్వహణ, మరమ్మతులతో పాటు రిపేరులో ఉన్న మోటార్ల పునరుద్ధరణలో తీవ్ర జాప్యం కారణంగా ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు.

పోటాపోటీగా నీటి వినియోగం..

కృష్ణానదికి ఈసారి పెద్దఎత్తున వరద పోటెత్తడంతో జూలై చివరి నాటికి శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యానికి చేరుకుంది. రోజుకు సుమారు 2 లక్షలకు పైగా క్యూసెక్కుల వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కడంతో ఈసారి పది రోజుల వ్యవధిలో ప్రాజెక్ట్ నిండిపోయింది. ఇరు తెలుగు రాష్ట్రాలు నిరాటంకంగా కొనసాగిస్తున్న విద్యుదుత్పత్తి ఫలితంగా మళ్లీ పది రోజుల్లోనే ప్రాజెక్ట్ 40 టీఎంసీల మేరకు ఖాళీ అయింది. ఈనెల 12న శ్రీశైలం ప్రాజెక్టులో 210.03 టీఎంసీల నీరు ఉండగా, గురువారం నాటికి ప్రాజెక్టులో 170 టీఎంసీల నీరు మాత్రమే మిగిలింది. ఏపీ పవర్‌హౌస్ ద్వారా విద్యుదుత్పత్తి చేపడుతూ రోజుకు సుమారు 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, తెలంగాణ పవర్‌హౌస్ ద్వారా నిత్యం 16 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం నిత్యం 30 వేల క్యూసెక్కుల చొప్పున ఇరు రాష్ట్రాలు నీటిని వినియోగిస్తున్నాయి. అలాగే ఏపీకి చెందిన పోతిరెడ్డిపాడు పథకం కింద నిత్యం సుమారు 28 వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. హంద్రీనీవా, సుజలా స్రవంతి, ముచ్చుమర్రి, మల్యాల పథకాల ద్వారా నిత్యం సుమారు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టులోని జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి.

లంచం ఇస్తేనే.. రుణాలిస్తారా

బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన

శాంతినగర్: కొందరు బ్యాంకు అధికారులు, మధ్యవర్తులు కుమ్మక్కై రైతుల నుంచి లంచం తీసుకొని రుణాలు ఇస్తున్నారని, మధ్యవర్తుల ద్వారా లంచం ఇచ్చిన వారికి మాత్రమే రుణాలు ఇస్తూ మిగతా వారికి మొండిచేయి చూపుతున్నారని ఇదేం పద్ధతి అని రైతులు ఆందోళనకు దిగారు. గురువారం శాంతినగర్ ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ రైతులు ధర్నా చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామస్తులకు ఏపీజీవీబీ ద్వారా క్రాప్‌లోన్లు ఇవ్వాల్సి వుంటుందని, లోన్‌కొరకు నేరుగా బ్యాంకుకు వెళ్లిన రైతులకు రుణాలు ఇవ్వకుండా ఆయా గ్రామాలకు చెందిన బ్రోకర్ల ద్వారా తీసుకువెళ్లిన ఫైళ్లకు మాత్రమే రుణాలు ఇస్తున్నారని, క్రాప్‌లోన్లకు కూడా లంచం ఇచ్చి రుణాలు తీసుకునే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈవిషయమై బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన రైతులు బ్యాంకు ఎదుట ధర్నా చేపట్టారు. బ్యాంకుకు వచ్చే రైతులకు అన్ని డాక్యుమెంట్లు చూసి అర్హులైన వారందరికి నేరుగా రుణాలు ఇవ్వాలని, లేని పక్షంలో అన్ని గ్రామాల రైతులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు వెంకటేష్, జూలెకల్ రైతులతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



శాంతినగర్ ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

గండీడ్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మోర వెంకటయ్య (55) వ్యవసాయంతో పాటు కిరాణ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. మహబూబ్‌నగర్ ప్రధాన రహదారికి అనుసరించి ఉన్న సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. గురువారం మట్టితో బేస్‌మెంట్ నింపడం ప్రారంభించాడు. టిప్పర్‌లో తీసుకొచ్చిన మట్టి కింద పడకపోవడంతో వెంకటయ్య పైకి ఎక్కి కిందకు తోస్తుండగా డ్రైవర్ మరింత పైకెత్తడంతో పైనున్న విద్యుత్ తీగలు తగిలి తెగి అతడిపై పడ్డాయి. మట్టిలో ఉన్న బండరాయి తలపై పడటంతో గాయమైంది. అక్కడే ఉన్న మరో వ్యక్తి గమనించి కర్రతో తీగలను తప్పించి వెంటనే కారులో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటయ్యకు ఇద్దరు కుమారులు మహేందర్, బాలుతో పాటు భార్య చెన్నమ్మ ఉన్నారు.

మురుగు కాల్వలో పడి మరో వ్యక్తి..


కృష్ణయ్యగౌడ్ (ఫైల్)

మిడ్జిల్: తెల్లవారుజామున మూత్రవిసర్జనకు వెళ్లిన ఓ వ్యక్తి మురుగుకాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిల్వేర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు కథనం మేరకు వివరాలిలా.. చిల్వేర్‌కు చెందిన కృష్ణయ్యగౌడ్(40) తెల్లవారుజామున మూత్ర విసర్జనకు బయటకు వచ్చాడు. వర్షం కురుస్తుండడం.. మురుగు కాల్వలో నిండుగా నీరు ప్రవహిస్తుండడంతో ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు అతడిని గుర్తించి బయటికి తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, భార్య గతంలో వదిలేసి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

నీటి గుంతలో పడి యువకుడు..



సుప్రీత్‌రెడ్డి (ఫైల్)

వెల్దండ: పశువుల కోసం నీటి గుంతలో నీటిని తోడుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడి యువకుడు మృతిచెందిన ఘటన వెల్దండ మండలం కుప్పగండ్లలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ పొలం వెల్దండ మండలం కుప్పగండ్ల రెవెన్యూ శివారులో ఉంది. అయితే, గోవర్ధన్‌రెడ్డి కుమారుడు సుప్రీత్‌రెడ్డి(20) తమ వ్యవసాయ పొలంలోని పాడిపశువులకు నీటిని తాపే ప్రయత్నంలో పొలంలో ఉన్న నీటి గుంతలోని నీరు తోడేందుకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో గుంతలో మునిగిపోయాడు. సమీప రైతులు సుప్రీత్‌రెడ్డి కనిపించకపోవడంతో పరిసరాల్లో వెతకగా.. నీటి గుంతలో పడిఉండడాన్ని గమనించారు. వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెల్దండ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని పల్లెగడ్డకు చెందిన బొంతు శివపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. శివ ఓ వివాహితను భయభ్రాంతులకు గురిచేస్తూ రెండేళ్లుగా అత్యాచారం చేస్తూ వచ్చాడని.. ఆమె ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

జూరాలకు వరద జోరు


జూరాల ప్రాజెక్టు వద్ద 10 క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద జోరు ప్రారంభమైంది. బుధవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 72,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం మధ్యాహ్నం వరకు 1,02,000 క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం 7 గంటల వరకు 97 వేలకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు అధికారులు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్టు గేట్లను ఎత్తి 70,420 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 34,346 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. క్రస్టుగేట్ల ద్వారా 70,420 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 47, భీమా లిఫ్టు-1కు 650, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 350, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులతో కలిపి మొత్తం 1,06,543 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగంగా కొనసాగుతోందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఈ ఏడాది ఎగువ, దిగువల్లో 600 మి.యూనిట్ల టార్గెట్ ఉండగా.. లక్ష్య సాధనకు చేరువలో ఉన్నామన్నారు. ప్రస్తుతం 11 యూనిట్లలో విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్లలో 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటివరకు 367.875 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు. కార్యక్రమంలో డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ, సిబ్బంది ఉన్నారు.

రెండు సైఫాన్ల నుంచి నీటి విడుదల..

మదనాపురం: సరళాసాగర్ జలాశయం సైఫాన్లు గురువారం ఉదయం తెరుచుకోవడంతో ఊకచెట్టు వాగుకు వరద పోటెత్తింది. ఒక వుడ్ సైఫాన్ ద్వారా 3,200 క్యూసెక్కులు మరో ప్రైమరీ సైఫాన్ ద్వారా 500 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తుందని అధికారులు తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో 5 గేట్ల ఎత్తివేత..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి 5 గేట్లను ఒక ఫీటు మేర ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రం వరద ఉధృతి తగ్గడంతో రెండు గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులోకి వస్తున్న నీటికి అనుగుణంగా గేట్లను తెరిచి దిగువకు విడుదల చేస్తున్నారు.

సుంకేసులకు 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

రాజోళి: సుంకేసుల డ్యాంకు 9,155 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు జేఈ రాజు తెలిపారు. ప్రాజెక్టు నుంచి రెండు గేట్లను తెరిచి 6,710 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నామని.. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

7 వేల క్యూసెక్కులు దిగువకు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి గురువారం సరళాసాగర్, కోయిల్‌సాగర్ ఊకచెట్టు వాగు నుంచి వరద చేరుతోంది. దీంతో అధికారులు ఒక గేటు తెరిచి 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉండగా.. ఎన్టీఆర్ కాల్వకు 750 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వకు 20, వివిధ ఎత్తిపోతల పథకాలకు 290, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి వివరించారు.


జలాశయం నుంచి దిగువకు పారుతున్న నీరు

నివాసాలకు కిలోమీటర్ దూరంలో
పరిశ్రమలు ఉండొద్దు

- ఏడాదిలోగా అలాంటి పరిశ్రమలను తరలించండి
- కాలుష్యంపై రెండు నెలల్లో తనిఖీలు చేపట్టాలి
- తరలింపు, తనిఖీల నివేదికను రిజిస్ట్రార్‌కు సమర్పించాలి
- స్పాంజ్ ఐరన్ పరిశ్రమలపై అధికారులకు హైకోర్టు ఆదేశం
- 2005లో 'మహబూబ్‌నగర్' వాసులు దాఖలు చేసిన పిటిషన్‌లో తుది తీర్పు

సాక్షి, హైదరాబాద్: తాము ఆదేశాలు వెలువడిన(సెప్టెంబర్ 10) నుంచి ఒక సంవత్సరంలోగా ప్రజల నివాసాల నుంచి కిలోమీటర్ పరిధిలో ఉన్న పరిశ్రమలను తరలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అలాగే, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమలను సందర్శించాలని.. పర్యావరణ (రక్షణ) చట్టం-1986, నీటి చట్టం, వాయు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడుస్తున్నాయో.. లేదో.. రెండు నెలల్లోగా తెలుసుకోవాలని స్పష్టం చేసింది. ఈ రెండు అంశాలపై రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు నివేదిక సమర్పించాలని చెప్పింది. 2005లో దాఖలైన రిట్ పిటిషన్‌లో విచారణ ముగించింది. 'మహబూబ్‌నగర్ జిల్లా స్పాంజ్ ఐరన్ పరిశ్రమల యూనిట్ల కారణంగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. వ్యవసాయ క్షేత్రాలతో పాటు మానవ జీవనం కూడా తీవ్ర ఇబ్బందికరంగా మారింది. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వాయు, నీటి కాలుష్యానికి పాల్పడుతున్నారు. నివాస గృహాల మధ్య అనుమతి ఇవ్వడం చట్టవిరుద్ధం. పరిశ్రమల కమిషనర్ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కోడిచర్ల, తీగాపూర్, గుండ్లపట్లపల్లి, రంగారెడ్డిగూడ, అప్పాజీపల్లి తండాల్లో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలి'అని కోరుతూ హైకోర్టులో మహబూబ్‌నగర్‌కు చెందిన వీరేందర్‌రెడ్డితో పాటు మరికొందరు 2005లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్ రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లు పేర్కొన్న పరిశ్రమల్లో కొన్ని పని చేయడం లేదని పీసీబీ అఫిడవిట్ దాఖలు చేసింది. మరికొన్ని పరిశ్రమల అనుమతుల వివాదం జాతీయ హరిత ట్రిబ్యునల్ వద్ద పెండింగ్‌లో ఉందని పేర్కొంది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పంటలకు నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వం డిపాజిట్ చేసిన పరిహారం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమల నిర్వహణ కారణంగా పంట నష్టపోయిన రైతులు ఇంకా ఉంటే పరిహారం కోసం చట్టప్రకారం ఆశ్రయించే స్వేచ్ఛను ఇస్తున్నామని తేల్చిచెప్పింది.

30న ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 30న అండర్-14, 17 బాలురు, అండర్-19 బాలబాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, హెచ్‌ఎం నర్సింహాచారి, పీడీ రవి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల అనంతరం 3వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి పోటీలను కూడా ధన్వాడలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్‌తో 30వ తేదీన ఉదయం 9 గంటలలోగా హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 80969 60696, 94926 77875 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ గాయత్రి, రెజ్లింగ్ కోచ్ శ్రీనివాసులు ఉన్నారు.

దామరగిద్దతండాలో చిరుత కలకలం



దామరగిద్ద: చిరుత వరుస దాడుల్లో మూగజీవాలు బలికావడంతో పాటు పొలాలకు వెళ్లే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గత ఆదివారం మండలంలోని బాపన్‌పల్లి గ్రామ అడవిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ శివారులో ఓ మేకను వేటాడింది. తాజాగా బుధవారం రాత్రి దామరగిద్దతండా హనుమాన్ ఓడ్క, మాగం చెరువు పరిసర ప్రాంతంలో లేగదూడను చంపి తినేసింది. గురువారం ఉదయం బాధిత రైతు గోన్యానాయక్ తన పొలానికి వెళ్లి చూడగా లేగదూడ చనిపోయి ఉండటంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే గత శుక్రవారం నుంచి బాపన్‌పల్లిలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్ బోను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చిరుతను బంధించి మూగజీవాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక


సంతోష్ కుమార్

కోస్గి: చదువుకు పేదరికం అడ్డుకాదని, చదవాలనే పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే లక్ష్యం ఎంత పెద్దదైన సులభంగా సాధించవచ్చునని నిరూపించాడు ఓ పేదింటి యువకుడు. సంవత్సరాలుగా చదివి ఓ ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనంగా మారిన నేటి పరిస్థితుల్లో కష్టపడి చదివి ఏకంగా ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. కోస్గి మున్సిపల్ విలీన గ్రామం గుండ్లపల్లికి చెందిన పోకల సంతోష్ కుమార్ పలు ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పలు పోటీ పరీక్షలు రాశాడు. ఈ క్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పాలిటెక్నిక్ జూనియర్ లెక్చరర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్స్, అసిస్టెంట్ ఇంజినీర్‌తో పాటు గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 1 నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి కోస్గి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదివాడు. పదో తరగతిలో చూపిన ప్రతిభ ఆధారంగా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై అక్కడే ఉన్నత చదువు పూర్తి చేసుకున్న సంతోష్ ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఎందరో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. కాగా ఐదు ఉద్యోగాలు సాధించిన సంతోష్ కుమార్ 'సాక్షి'తో మాట్లాడుతూ నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగంలో చేరుతున్నట్లు తెలిపాడు.

కిరాణ దుకాణంలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: కిరాణ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన నరేందర్ నల్లవెల్లి రోడ్డులో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లగా.. గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళం పగులగొట్టి రూ. లక్ష చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, మరో రెండు దుకాణాల్లో సైతం దుండగులు చోరీకి యత్నించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన


నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

దోమలపెంట: రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని కోరుతూ భూగర్భ విద్యుత్ కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టీజియన్లు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈగలపెంట సీఈ కార్యాలయం శక్తిసదన్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎస్.సునీంధర్, కన్వీనర్ బి.మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రామగుండంలో జెన్‌కో ద్వారా నిర్వహించబడుతున్న 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మూసివేసి దాని స్థానంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి, జెన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొత్త విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ మేరకు గురువారం నుంచి మే నెల 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యుత్ సంస్థల వద్ద ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టీజియన్లు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారని.. ఇందులో భాగంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

సింగరేణికి అప్పగిస్తే ఉద్యమమే..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రామగుండంలో జెన్‌కో భాగస్వామ్యంతో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును సింగరేణికి అప్పగిస్తే ఉద్యమమేనని విద్యుత్ ఉద్యోగులు నినాదించారు. గురువారం విద్యుత్ ఉద్యోగులు విద్యుత్‌భవన్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ప్రతాప్ మాట్లాడుతూ.. రామగుండంలో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 62.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం కాలపరిమితి ముగియడంతో కూల్చేసి దాని స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల కేంద్రాన్ని నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో సింగరేణిని భాగస్వామ్యం చేయడం సరికాదన్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు జెన్‌కోలో గేట్ మీటింగ్‌లు.. 4, 5 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలి పారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్ర తి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో ఘరానా మోసం

- సభ్యులకు రూ.3 కోట్ల వరకు టోకరా
- 70 మందికి పైగా మోసపోయిన లబ్ధిదారులు


కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో పేర్లు రాస్తున్న చీటీ బాధితులు

కొత్తకోట రూరల్: చీటీల పేరుతో భార్యాభర్తలు ఘరానా మోసానికి పాల్పడిన సంఘటన కొత్తకోట విద్యానగర్‌కాలనీలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని సత్యహళ్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ, అరుణ దంపతులు గత కొన్నేళ్లుగా కొత్తకోటలోని విద్యానగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. బాలకృష్ణ డ్రైవర్‌గా, స్థానికంగా ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండేది. అయితే బాలకృష్ణ మూడేళ్లుగా తెలిసిన వ్యక్తులతో చీటీలు వేయిస్తుండగా.. భార్య అరుణ సైతం తోటి ఉద్యోగులతో చీటీలు వేయించి భర్తకు ఆసరాగా నిలిచింది. ఈ క్రమంలోనే అరుణ మూడు నెలలుగా కాలేజీకి వెళ్లడం మానేసింది. చీటీలు కట్టడం పూర్తయిన వారు, డబ్బులు అవసరం ఉన్నవారు చీటీ డబ్బులు కావాలని అడగడంతో నేడు.. రేపు అంటూ కాలయాపన చేశారు. తర్వాత బాధితులకు చీటీ డబ్బులు ఇవ్వలేక, అడిగిన వారికి సమాధానం చెప్పలేక బాలకృష్ణ, అరుణ దంపతులు పిల్లలతో కలిసి ఈ నెల 23న పరారయ్యారు. ఇద్దరి ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉండటంతో మోసపోయామని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. బాలకృష్ణ పరారు కావడానికి 15రోజుల ముందే వనపర్తిలో ఓ లాయర్‌ను కలిసి చీటీలకు సంబంధించిన రికార్డులు అప్పజెప్పి కోర్టు నుంచి ఐపీ తీసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి స్పందిస్తూ.. చీటీల పేరుతో ఓ వ్యక్తి మోసం చేసి పారిపోయినట్లు తెలుసని.. ఎంత మంది మోసపోయారో వారి వివరాలు ఇవ్వడం జరిగిందని, బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

లక్ష మంది రైతులతో ఉదండాపూర్‌కు వస్తా

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


కంచన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే కారణంతో బీఆర్‌ఎస్ నాయకులు పనులకు అడ్డుతగులుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలోని బైరంపల్లి, కంచన్‌పల్లి, వస్పుల, చిల్వేర్, కొత్తపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసి మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని.. లక్ష మంది రైతులతో కదిలివచ్చి కట్టపై కూర్చొని పనులు చేయిస్తానని, ఎవరు అడ్డుకుంటారో చూస్తామని హెచ్చరించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని.. వారి బాగుకోసం ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తుంటే బీనామీలు, మరికొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నకిలీ పట్టాలు పొందిన వారి భరతం పడతామని.. అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ నిధులు విడతలవారీగా అందజేస్తామని తెలిపారు. రెండురోజుల కిందట రైతుల ఖాతాల్లో రూ.45 కోట్లు జమ చేశామన్నారు. రెండు నెలలకు ఓమారు ప్రాజెక్టు పనులను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని.. మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రబ్బాని, మండల అధ్యక్షుడు అల్వాల్ రెడ్డి, నాయకులు సాయిలు, గౌస్, వెంకటయ్య, నర్సింహులు, మల్లికార్జున్‌రెడ్డి, విజయ్, ఉస్మాన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి


పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: యువత సన్మార్గంలో పయనించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో గురువారం సత్యశోధన పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, సన్మార్గంలో నడవాలని ఆకాంక్షిస్తూ.. రిటైర్డ్ డీఈఓ శివార్చక విజయ్‌కుమార్ అధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీ నుంచి జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం నుంచి ఉమామహేశ్వరం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. వంద రోజులపాటు వెయ్యి కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్‌లో 2 వేల ప్రదర్శనలు


కేకు కట్ చేస్తున్న ఎస్వీఎస్ వైద్య సిబ్బంది

పాలమూరు: ఎస్వీఎస్ కళాశాలలో నిర్వహించిన వైద్య విజ్ఞాన ప్రదర్శన (ఎగ్జిబిషన్)లో మొత్తం 25 మెడికల్ డిపార్ట్‌మెంట్లకు గాను వెయ్యి స్టాళ్లలో 2 వేల ప్రదర్శనలు చేసినట్లు ఎండీ డాక్టర్ కేజే రెడ్డి తెలిపారు. మొదట మూడు రోజులపాటు విశేష స్పందన చూసి మరో 8రోజుల పాటు విజయవంతంగా నిర్వహించామని.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని వెల్లడించారు. 8 రోజుల్లో 62 వేల మంది విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను సందర్శించారని చెప్పారు. వచ్చిన ప్రతి ఒక్కరికి ఆహారం, తాగునీరు, ఇతర వసతులు కల్పించామని, ఎస్వీఎస్ వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఎంతో కష్టపడ్డారన్నారు. ఎగ్జిబిషన్‌లో ఫిజియాలజీ, పెథాలజీ, క్లినికల్ మెడిసిన్‌పై అధిక దృష్టిపెట్టామన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతమైన సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


పాముకాటుతో మహిళా రైతు మృతి

కోస్గి: వ్యవసాయ పొలంలో పశువుల కోసం గడ్డి కోస్తున్న సమయంలో పాము కాటుకు గురై ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు పట్టణంలోని వినాయక్ నగర్‌కు చెందిన సావిత్రమ్మ(42) గురువారం ముక్తిపాడ్ పరిధిలో ఉన్న వ్యవసాయ పొలంలో పశువుల కోసం మేత కోసేందుకు వెళ్లింది. మేత కోస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. ఈ విషయం కుటుంబ భ్యులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలానికి వెళ్లి ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతురాలికి భర్త మల్లప్పతో పాటు ఓ కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి స్టేజీ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మొండి బాలమ్మ (32) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలమ్మ చిత్తు కాగితాల సేకరణ నిమిత్తం ఈ ప్రాంతానికి రాగా ప్రమాదం జరిగినట్లు చెప్పారు. మృతురాలి బంధువు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


మనీషా (ఫైల్)

దామరగిద్ద: దామరగిద్దతండాకు చెందిన విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తండాకు చెందిన రాజు నాయక్, సరోజ కుమార్తె నానావత్ మనీషా (16) జిల్లా కేంద్రంలోని బీసీ వసతిగృహంలో ఉంటూ ఎస్వీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతుండేది. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వసతిగృహంలోనే మూర్ఛ రావడంతో వసతిగృహం నిర్వాహకులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌లోని నీమ్స్, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మూడురోజుల పాటు చికిత్స అందించినా కోలుకోకపోవడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.